క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



తెయూ(డిచ్‌పల్లి): తెయూలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వర్సిటీ పీడీఎస్‌యూ నాయకులు గౌతమ్‌రాజ్ డిమాండ్ చేశారు. క్యాంపస్‌లోని ఓల్డ్ బాయ్స్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాంపస్‌లోని బాలుర, బాలికల హాస్టల్స్‌లో సమస్యలు నెలకొన్నాయన్నారు. వాష్ బేసిన్స్‌లో నల్లాలు రావడం లేదని, కిటీలకు జాలీలు లేక దోమలు కుట్టడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపించారు. బాలికల హాస్టల్‌లో గదులు సరిపోక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాకేశ్, ఆకాశ్, ప్రభాస్, తిరుపతి తదితదిరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సిరికొండ: ఆపదలో ఉన్న మిత్రుడికి ఆర్థిక సాయం చేసి ఆదర్శంగా నిలిచారు మిత్ర బృందం. పోత్నూర్ గ్రామానికి చెందిన దర్శనం బాలయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పెద్దవాల్గోట్ జెడ్పీహెచ్ఎస్‌లో 2000-01 బ్యాచ్ అతడి పదో తరగతి మిత్రులు పెద్దవాల్గోట్, చిన్నవాల్గోట్, పోత్నూర్, రేకుల్‌పల్లి గ్రామాలకు చెందిన వారు రూ. 44500 లను బాలయ్యకు ఆయన ఇంట్లో శనివారం అందజేశారు. బాలయ్య కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



ఖలీల్‌వాడి: చేనేత పద్మ సమైఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా సిలివేరి గణేశ్‌ను నియామిస్తూ శనివారం రాష్ట్ర చేనేత పద్మ సమైఖ్య అధ్యక్షుడు కొండా రామ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో రాష్ట్ర కమిటీ సమావేశంలో ప్రత్యేక తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. పద్మశాలిల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మోపాల్: మండలంలోని కంజర్ శివారులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఫిజిక్స్ జూనియల్ లెక్చరర్ పార్ట్ టైమ్ పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయలలిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్, బీఈడీ విద్యార్హతలు కలిగిన వారు అర్హులన్నారు. మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని, అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9949356342 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

11న పెన్షనర్ల ధర్నా

ఖలీల్‌వాడి: పెండింగ్ డీఏల విడుదల, కొత్త పీఆర్సీ అమలు, నగదు రహిత వైద్యసేవలు, పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపు వంటి ప్రధాన డిమాండ్ల సాధనకు ఈ నెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యలపై మంత్రులను, అధికారులను పదేపదే కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ధర్నాను పెన్షనర్లు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో శిర్ప హనుమాండ్లు, నారాయణ, జార్జ్, భోజారావు, నరేందర్, సాంబశివరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు



సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే ఇంగ్లిషు అక్షరాల ఆకారంలో కూర్చుని శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ కళాశాలలో ఫ్రెషర్స్ డే..

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు అలరించాయి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, రవికుమార్, నజీర్, సత్యం సాయి, బాల రాజు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రెండు మారినా.. ఫ్రెండు మారడు!

నేడు స్నేహితుల దినోత్సవం

మన జీవితంలో ఒక్కసారి మధుర క్షణాల్ని గుర్తు చేసుకుంటే అందులో అత్యధికం స్నేహితులు మన వెంట ఉన్నవే ఎక్కువగా ఉంటాయి. అందులోనూ స్కూల్, కాలేజీ స్నేహం ప్రత్యేకం. జిల్లాలో కొందరు చిన్న నాటి నుంచి మొదలైన స్నేహం ఇంకా కొనసాగిస్తూ వారిలో ఎవరికైన ఆపద వస్తే అండగా నిలుస్తూ స్నేహానికి నిదర్శనంగా నిలుస్తున్నారు. మరికొందరు తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, ఇంకొందరు రక్తదానంతో ఆపదలో ఉన్న వారిని కాపాడాలని మిత్రులతో కలిసి స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేశారు.



వీఆర్ఏ పిల్లలను దత్తత తీసుకుంటున్న సభ్యులు

సిరికొండ: హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన ఆ స్నేహితులు ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూనే పర్యావరణ పరిరక్షణ బాధ్యతను తీసుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని తూంపల్లిలో 2010-11 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన 23 మంది స్నేహితులు 2021లో హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. కరోనా సమయంలో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం సేవా భావంతో అన్ని దానాల్లో కెల్లా రక్తదానం మిన్న అనే నినాదంతో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తు, ఇప్పటి వరకు 160 యూనిట్ల రక్తాన్ని సేకరించి చికిత్స పొందుతున్న వారికి అందించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడ్డ గుంతలను పూడ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వెయ్యికి పైగా మొక్కలు నాటారు. వారు చదువుకున్న పాఠశాలలో పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ అందిస్తున్నారు. ఇటీవల కొండాపూర్‌లో చెరువులో పడి మృతి చెందిన వీఆర్ఏ తూము సుదర్శన్ ముగ్గురు పిల్లలను సంస్థ ద్వారా చదివిస్తున్నారు.

స్వచ్ఛ ఘన్‌పూర్..



చెత్తను, పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సభ్యులు

డిచ్‌పల్లి: తమ గ్రామాన్ని స్వచ్ఛంగా తయారు చేయాలనే సంకల్పంతో స్నేహితులంతా కలిసి స్వచ్ఛ ఘన్‌పూర్ పేరుతో బృందంగా ఏర్పడ్డారు. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో మూడేళ్ల క్రితం 15 మందితో ప్రారంభించిన ఈ బృందంలో ఇప్పుడు 40 మంది వరకు చేరారు. గ్రామంలోని కాలనీల్లో ఎక్కడ చెత్త, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు కనిపించినా స్వచ్ఛ ఘన్‌పూర్ సభ్యులు వెంటనే శుభ్రం చేస్తారు. మురికి కాలువలు ధ్వంసమైతే వెంటనే వాటిని సరి చేస్తారు. ప్రతి నెలా రూ.100 చొప్పున డబ్బులు జమచేసి గ్రామంలో ఎవరైనా పేద కుటుంబానికి చెందిన వారు మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇటీవల గణేశ్ అనే యువకుడు చనిపోతే వారి కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇలా స్నేహితులంతా కలిసి సమాజసేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

స్నేహితులకు అండగా..



ఇందల్వాయి: ఇరవై ఏళ్ల క్రితం పదో తరగతిలో మొదలైన స్నేహం ఇంకా కొనసాగిస్తూ వారిలో ఎవరికి ఆపదొచ్చినా అన్ని విధాల అండగా నిలుస్తూ, తాము చదివిన పాఠశాలకు కూడా సేవలు చేస్తున్నారు ఎల్లరెడ్డిపల్లికి చెందిన 2005-06 పదో తరగతి పూర్వ విద్యార్థులు. తమ స్నేహానికి గుర్తుగా మొదట చదివిన పాఠశాలలో స్వామి వివేకానంద విగ్రహాన్ని 2010 లో ఏర్పాటు చేశారు. అనంతరం తమ మిత్ర బృందంలో ఉంటూ అకాల మరణం చెందిన సతీశ్ కుటుంబానికి రూ. 35 వేలు, ప్రమాదంలో గాయపడ్డ గంగాధర్‌కు రూ. 85 వేలు, స్నేహితురాలు భర్తకి పక్షవాతం వస్తే వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 30 వేలు అందించారు. తమ స్నేహితుల్లో ఎవరికి ఆపద వచ్చినా అన్ని విధాల ముందుంటామని ధీమాగా చెబుతున్నారు.

బీసీల రిజర్వేషన్ల సాధనకే జనహిత పాదయాత్ర



అర్గుల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికే జనహిత పాదయాత్ర చేపడుతున్నట్లు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం అర్గుల్ పీవీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనహిత పాదయాత్రలో భాగంగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో ఆదివారం నిర్వహించే ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్తకర్తల సమావేశాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్, మంత్రి సీతక్క హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పాదయాత్రలో గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని అప్పటికప్పుడే పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేస్తారన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ బీజేపీ కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. ఇప్పుడు రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ నాయకులు దీక్ష చేస్తామనడం హాస్యస్పదమన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయరెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్, మాజీ ఎంపీపీ అప్పాల రాజన్న, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు చిన్న సాయారెడ్డి, వసంత్ రావు, సొప్పరి వినోద్, కాట్‌పల్లి నర్సారెడ్డి, గంగారెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నిజామాబాద్ సిటీ: నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న మున్నూరుకాపు సంఘంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు రామర్తి గోపి శనివారం తెలిపారు. శిబిరంలో వైద్యులు రక్తపరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైవారికి ఉచితంగా మందులు అందజేస్తారని అన్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్యాంపస్‌లో బాలికల హాస్టల్‌ను నిర్మించాలి



మాట్లాడుతున్న తెయూ ఏబీవీపీ అధ్యక్షుడు పృథ్వి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో వెంటనే నూతన బాలికల హాస్టల్‌ను నిర్మించాలని వర్సిటీ ఏబీవీపీ అధ్యక్ష, కార్యదర్శులు పృథ్వి, సమీర్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ పేరుతో ఏర్పడిన యూనివర్సిటీలో అడుగడుగునా సమస్యలు నెలకొన్నాయన్నారు. రూసా నిధులు మంజూరై, టెండరు ప్రక్రియ పూర్తయినప్పటికీ బాలికల హాస్టల్ నిర్మాణ పనులు ప్రారంభించక పోవడంలో వీసీ అలసత్వం, స్థానిక ఎమ్మెల్యే రాజకీయం కారణమని ఆరోపించారు. యూనివర్సిటీకి ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని ఇప్పుడు కొత్తగా కళాశాలలో చేరే విద్యార్థినులకు ఏ విధంగా వసతి కల్పిస్తారో వర్సిటీ ఉన్నతాధికారులు చెప్పాలని పేర్కొన్నారు. హాస్టల్ నిర్మాణ పనులను ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మోహన్, నాయకులు మనోజ్, అనిల్, అఖిల్, సంతోష్, సాయి, శ్రీనిత్య, వర్షిణి, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రజలకు పాలిథిన్‌పై అవగాహన కల్పిస్తున్నారు. తడి-పొడిచెత్తను వేర్వేరుగా ఉంచాలని స్థానికులకు సూచిస్తున్నారు. శనివారం సుభాష్‌నగర్‌లోని నిర్మల్ హృదయ్ పాఠశాల విద్యార్థులకు డిప్యూటీ కమిషనర్ ఎం.రవిబాబు పరిసరాలు-పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పాలిథిన్ వాడొద్దని, నో ప్లాస్టిక్ నినాదాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ అధికారులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ బీసీ ధర్నాలో జిల్లా నాయకులు



సుభాష్‌నగర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి నయవంచన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరికి నిరసనగా హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనకు జిల్లా నాయకులు హాజరయ్యారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్ నేతృత్వంలో ఓబీసీ మోర్చా కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ధర్నాలో ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల ఓట్లతో గెలిచి వారి ఆత్మగౌరవం మీద దెబ్బకొట్టిందని ఆరోపించారు. నాయకులు రంజిత్, శ్రీనివాస్, మారుతి, సురేశ్ తదితరులు ఉన్నారు.

ఇందిర ఆత్మీయ భరోసా కోసం ఆందోళనలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరికొండ: ఇందిర ఆత్మీయ భరోసా అమలుకు కోసం ఈ నెల 20 నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, రమేశ్ తెలిపారు. మండలంలోని గడ్కోల్‌లో శనివారం సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ నెల 5న కలెక్టరేట్, 20న జీపీలు, 21 నుంచి 30 వరకు తహసీల్ కార్యాలయాలు, సెప్టెంబర్ 10న చలో సెక్రటేరియట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. బాల్‌రెడ్డి, సాయారెడ్డి, అశోక్, దయాల్‌సింగ్, ఎర్రన్న, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత టీబీ పరీక్షలు



ధర్పల్లి: ధర్పల్లి, దమన్నపేట్ గ్రామాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత టీబీ పరీక్షల శిబిరాన్ని శనివారం నిర్వహించారు. శిబిరంలో 256 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 21 మందికి ఎక్స్‌రే 47 మందికి రక్త నమూనాలను సేకరించినట్లు వైద్యులు తెలిపారు. సేకరించిన నమూనాలను జిల్లా టీబీ కేంద్రానికి వైద్యాధికారులు పంపించారు. అలాగే గ్రామ ప్రజలకు మలేరియా, డెంగీ, మధుమేహం, హెచ్ఐవీ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. శిబిరంలో మెడికల్ ఆఫీసర్ అర్వింద్, సూపర్‌వైజర్లు పద్మ, భూలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతను పూడ్చిన అధికారులు



రోడ్డుపై గుంతను పూడ్చిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతను ఆర్అండ్‌బీ అధికారులు పూడ్చివేశారు. నడిరోడ్డుపై గుంత.. వాహనదారులకు చింత అనే కథనాన్ని సాక్షి దినపత్రికలో జూలై 29న ప్రచురితమైంది. ముందుగా స్పందించిన గ్రామ పంచాయతీ సిబ్బంది వాహనదారులకు హెచ్చరికగా రోడ్డుపై ఏర్పడిన గుంతలో ఎర్రజెండాను ఏర్పాటు చేసి సమస్యను ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి: ప్రభుత్వం అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులను జారీ చేసిందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు డాక్టర్ షాదుల్లా అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కొత్త రేషన్‌కార్డులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని షాదుల్లా అన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, డాక్టర్ లింబాద్రి, బాజేందర్, హరీశ్, గంగిభూపతి, సాగర్, రాంచందర్, సతీశ్‌రెడ్డి, దేవేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీజీసీటీఏ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని అధ్యాపకుల బదిలీలు, కెరీర్ అడ్వాన్స్ స్కీమ్ వంటి తదితర అంశాలపై విశేష కృషి చేసిన తెలంగాణ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ బ్రిజేష్‌ను జీజీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ పి రామ్మోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అంతకుముందు అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాలలు, అధ్యాపకుల క్షేత్రస్థాయి సమస్యలను బ్రిజేష్ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అధ్యాపకులు డాక్టర్ దండు స్వామి, రంగరత్నం, భరత్ రాజ్, ముత్తెన్న, రాజేశ్, చంద్రశేఖర్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి, ఏవో రాంకిషన్, ఉదయ్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

గంగారాం నాయక్‌కు..

సుభాష్‌నగర్: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (621/2014) జిల్లా రీజినల్ అధ్యక్షుడిగా ఎన్నికైన గంగారాం నాయక్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్-82) నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేనావత్ రవి, నాయకులు జాషువ, రవి, పీర్‌సింగ్, ప్రవీణ్, నీల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

ఖలీల్‌వాడి: ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రం అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న సంక్షేమ హాస్టల్స్‌కు సంబంధించిన డైట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌ను అమలు చేయాలన్నారు. జిల్లాకు మంజూరైన ఇంజినీరింగ్ కాలేజీకి కొత్త భవనంతోపాటు ఫ్యాకల్టీని నియమించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, రాష్ట్ర కోశాధికారి సూర్యప్రకాశ్, జిల్లా నేతలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

సుభాష్‌నగర్: కాంగ్రెస్ జనహిత పాదయాత్ర సందర్భంగా బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. నాయకులను అదుపులోకి తీసుకుని 2, 3, 4వ టౌన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో నాయకులు సిర్ప రాజు, ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్ ఠాగూర్, సత్యప్రకాశ్, చింతకాయల రాజు, అగ్గు సంతోష్, సదానంద్ ఉన్నారు. అదుపులోకి తీసుకున్న బీఆర్ఎస్ నాయకులను బీఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్ మధుసూదన్‌రావు, కో కన్వీనర్ డాక్టర్ పులి జైపాల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంఘీభావం తెలిపారు.

పీడీఎస్‌యూ నాయకులు..

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర సందర్భంగా పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు బి ప్రిన్స్‌ను అరెస్ట్ చేయడం సరైంది కాదని, అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని జిల్లా ప్రధానకార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ తెలిపారు. అరెస్ట్ చేసిన ప్రిన్స్, పీడీఎస్‌యూ కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కొండూర్‌లో తల్లి పాల వారోత్సవాలు

సిరికొండ: మండలంలోని కొండూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు తల్లి పాల ఆవశ్యకతను వివరించారు. వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణకుమారి, జీపీ కార్యదర్శి నాగరాజు, ఏఎన్ఎంలు అనురాధ, రాజమణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పద్మావతి, పద్మ, త్రివేణి, పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లెక్చరర్లను నియమించాలి



సుభాష్‌నగర్: జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ కళాశాల కమిటీ కార్యదర్శి నసీర్, ఉపాధ్యక్షుడు వినోద్ డిమాండ్ చేశారు. శనివారం ఈమేరకు ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కళాశాలలో ప్రతి కోర్సుకు సంబంధించిన పుస్తకాలు లైబ్రరీలో విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తరగతులు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. ఇంతవరకూ సరిపడా అధ్యాపకులు లేరన్నారు. వెంటనే లెక్చరర్లను నియమించాలని డిమాండ్ చేశారు. నాయకులు సృజన్, అజయ్, కిరణ్, ధీరజ్, భీమేశ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ, పీజీ కోర్సులకు 13 వరకు అవకాశం

సుభాష్‌నగర్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కో ఆర్డినేషన్ సెంటర్‌లో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 13వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి రామ్మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో అన్ని కోర్సులతోపాటు ఈ సంవత్సరం నుంచి పీజీలో బోటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బీఎల్ఐఎస్‌సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ కె రంజిత పేర్కొన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ కోర్సులు రెగ్యులర్ కోర్సులతో సమాన గుర్తింపు కలిగి ఉంటాయన్నారు. 2024-25 సంవత్సరంలో యూజీ, పీజీలో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు ఈనెల 13వ తేదీలోగా ట్యూషన్ ఫీజు/ కోర్సు రెన్యువల్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఆమె తెలిపారు.

జవాన్ విగ్రహావిష్కరణ



ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్ యాదవ్ భారత సైన్యంలో చేరి తొమ్మిదేళ్లు సేవ చేసి 2023 ఆగస్టులో అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రశాంత్ కుటంబ సభ్యులు, గ్రామస్తులు, తోటి సైనికులు ప్రశాంత్ విగ్రహాన్ని గ్రామ ముఖద్వారం వద్ద శనివారం ఏర్పాటు చేశారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేశ్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి



పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న మానాల, కేశ వేణు



మార్కెట్‌యార్డులో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ ముప్ప గంగారెడ్డి

సుభాష్‌నగర్/ నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, పార్టీ జిల్లా యువ నేత విజయ్‌పాల్ రెడ్డి హైదరాబాద్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ అధక్షుడు, రాష్ట్ర సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా కేంద్రంలోని బాపూజీ వచనాలయంలో అధ్యక్షుడు భక్తవత్సలం, ప్రధాన కార్యదర్శి మీసాల సుధాకర్ కేక్ కట్ చేశారు.